క్లుప్తంగా

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

కడప కార్పొరేషన్: 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర 2025 పేరుతో జూన్ 1వ తేది నిర్వహించే ఫ్యామిలీ యోగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రిమ్స్ సమీపంలోని రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో ఆదివారం ఉదయం 5.30 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలంతా యోగాను అలవరుచుకోవాలని, తద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. యోగా ఎలా చేయాలి అని నేర్చుకొని ఇళ్లలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రతిరోజూ చేయాలన్నారు. జూన్ 1వ తేది ఆదివారం జరిగే ఫ్యామిలీ యోగా కార్యక్రమానికి పిల్లలు, పెద్దలు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయులు తరలిరావాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో జూన్ 1న యోగ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడప మండల విద్యాశాఖ అధికారి దిద్దకుంట గంగిరెడ్డి తెలియ జేశారు. మండలంలో పనిచేస్తున్న అన్ని యాజమాన్యాల పాఠశాలల నుండి జూన్ 1వ తేదీ ఉదయం 6.30 ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడంద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత తెలిపారు. శుక్రవారం నాగరాజుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఏరియాలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా స్థానిక నాగరాజుపేటలోని మున్సిపల్ హైస్కూలులో యోగాసనాలు అభ్యసింపజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి కి సన్మానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావులను ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు శుక్రవారం సన్మానించారు. ఆర్టీసీలో 1/2019 సర్క్యులర్ అమలు చేయడాన్ని స్వాగతిస్తూ ఆయా నేతలు కడపలో ఉన్న వారిని కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ పీఎస్ ఖాన్, మహాలక్ష్మి, ఎల్ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

అది మహా గోడు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడపలో టీడీపీ నిర్వహించిన మహానాడు మహాగోడుగా ఉందని.. ఇందులో చంద్ర బాబు చెక్క భజన, లోకేష్ ను పొగడడం, జగన్ ను తిట్టడం తప్ప ఎటువంటి సారాంశం లేదని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఏపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి సత్తార్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సలావుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పశు బీమా చేయించుకోవాలి

సిద్దవటం : పశువుల బీమా చేయించని పాడి రైతులు ఎవరైనా ఉంటే తప్పకుండా బీమా చేయించుకోవాలని కడప డివిజన్ పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు టి.వెంకటమరమణయ్య తెలిపారు. మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రిని శుక్రవారం విస్తృత తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణయ్య మాట్లాడుతూ పశువుల బీమా చేయించుకున్న తరువాత ఒక వేళ పశువు చనిపోతే రూ. 30 వేలు వరకు బీమా వస్తుందన్నారు. తొలకరి వర్షం వస్తే పశువులకు, దూడలకు గొంతువాపు వ్యాధి, గొర్రెలకు చిటుకు రోగం వస్తుందన్నారు. ముందు జాగ్రత్త చర్యగా డివిజన్ పరిధిలోని అన్నీ పశువుల ఆసుపత్రులకు వ్యాక్సిన్‌ను పంపిణీ చేశామన్నారు. పశు సంవర్ధక శాఖసిబ్బంది సమయపాలన పాటించి తొలకరి వర్షంలో వ్యాక్సినేషన్ పట్ల సిబ్బందికి అందుబాటులో ఉండేలా తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. అత్యవసరంగా వ్యాక్సినేషన్ పశువులకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలియజేశామన్నారు. కార్యక్రమంలో కడప డివిజన్ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు జి.శ్రీనివాసులరెడ్డి, సిద్దవటం పశువుల ఆసుపత్రి సహాయ సంచాలకులు బి.లక్ష్మిదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

శీతల గంగమ్మకు ప్రత్యేక పూజలు

సిద్దవటం : మండలంలోని మాదవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారికి శుక్రవారం భక్తి శ్రద్దలతో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గణపతి పూజ, పుణ్యాహ వాచనం, అమ్మవారికి కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను జరిపించారు. అనంతరం వచ్చిన భక్తులు అమ్మవారి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకొని, కాయా కర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మొదలైన వాన

నైరుతి రుతుపవనాల ప్రభావంతో బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం ఫలితంగా రాష్ట్రంలో మూడు రోజులు వానలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో కడప నగరంలో గురువారం రాత్రి నుంచి వాన మొదలైంది. శుక్రవారం ఉదయం నుంచి మబ్బులు కమ్ముకొని ఉన్న ఆకాశం మధ్యాహ్నానికి వర్షించింది. వాన రాకతో తోపుడు బండ్ల వ్యాపారులు, వీధి వ్యాపారస్తులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం వల్ల పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. – కడప కార్పొరేషన్





దళితులపై జరుగుతున్న దాడులు కనిపించలేదా



మాట్లాడుతున్న దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిశోర్ బూసిపాటి

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు హోంమంత్రి అనితకు కనిపించకపోవడం విచిత్రంగా ఉందని దళిత ఫోరం చైర్మెన్ కిశోర్ బూసిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ఆమె... జమ్మలమడుగులో మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి, హత్య చేస్తే బాలిక కుటుంబాన్ని పరామర్శించేంత తీరిక కూడా హోం మంత్రికి లేకపోవడం విచారకరమన్నారు. సీఎం చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తడం, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం మినహా దళితులపై జరుగుతున్న దాడులపై ఆమె నోరు విప్పడం లేదన్నారు. బద్వేలు పరిధిలోని కొత్తపల్లిలో భర్త ఎదుటే మహిళను లాగి కొడితే ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇటీవల తిరుపతిలో బీటెక్ విద్యార్థి జేమ్స్‌ను అగ్రవర్ణ విద్యార్థులు నిర్బంధించి హింసించి అవమానిస్తే హోంమంత్రి కనీసం స్పందించలేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో దళిత కుటుంబాలను వెలివేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా హోం మంత్రి అనిత రాష్ట్రంలో దళితులపై జరిగిన దాడులపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సేన ఏపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పెంచలయ్య పాల్గొన్నారు.

2న ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ చేపడుతున్న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట జరిగే ఆందోళన జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కడప నగర సమగ్రాభివృద్ధికి , అందుకు తగ్గ నిధులు విడుదల కోసం పాలక ప్రభుత్వాలపై ఒత్తిడికి తగ్గ ఉద్యమ కార్యాచరణ చేపట్టాలన్నారు. పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇండ్లు ఇస్తాం, ఇంటి స్థలం ఇస్తాం, రేషన్ కార్డుతో పాటు మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, 24 గంటలు తాగునీరు అందిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలతో ఓట్లు దండుకొని అధికారంలోకి రాగానే ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు నెడుతున్నారని ఆరోపించారు. దశాబ్దాల తరబడి పేదలు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం కోసం అధికారులు, అధికార పార్టీ నేతల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం తలపెట్టిన సీపీఐ రాష్ట్రవ్యాప్త ఆందోళన జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు చంద్ర శేఖర్ రెడ్డి, నగర కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, సావంత్ సుధాకర్, బ్రహ్మం, మునెయ్య, శంకర్ నాయక్, భాగ్యలక్ష్మి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం : దాతలు ముందుకు వచ్చి ఏర్పాటు చేస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే జ్ఞాన సముపార్జన పెంపొందించుకోవచ్చని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్ రెడ్డి, ఆర్యవైశ్య కమిటీ చైర్మన్ కె.వెంకటరమణయ్య తెలిపారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో 15 రోజులుగా ప్రొద్దుటూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఇందులో భాగంగా 'భగవద్గీత శ్లోక పఠనం' తదితర అంశాలపై శిక్షణ నిర్వహించారు. చివరి రోజు శుక్రవారం శిక్షణ పొందిన అంశాలపై చిన్నారులకు పరీక్ష నిర్వహించి బహుమతులు అందజేశారు.

పరీక్ష ఫీజు గడువు పెంచాలి



డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: పారా మెడికల్ విద్యార్థుల పరీక్ష ఫీజు గడువును పెంచి పరీక్షలు వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడుకు రిమ్స్ మెడికల్ కళాశాలలో పారా మెడికల్ విద్యార్థులపై జరుగుతున్న కక్ష సాధింపు చర్యలు ఆపాలని, పరీక్ష ఫీజు గడువు పెంచి పరీక్షలు వాయిదా వేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప రిమ్స్ మెడికల్ కళాశాలలో పారా మెడికల్ చదువుతున్న విద్యార్థులు రాయలసీమ నలుమూలల నుండి వచ్చే అభ్యసిస్తున్నారన్నారు. అయితే కాలేజీలో విద్యార్థులకు వసతి గృహం కల్పించాలని, విద్యార్థులతో వెట్టిచాకిరి మానుకోవాలని ప్రశ్నించినందుకు పారా మెడికల్, పెథాలజీ హెచ్‌వోడీ శోభారాణి విద్యార్థులపై కక్ష సాధింపులో భాగంగా హాజరు శాతం తక్కువ ఉందని 35 మంది గాను 21 మందిని యూనివర్సిటీ పరీక్ష ఫీజు కట్టించకుండా నిలిపి వేసే దుర్మార్గ చర్యకు పాల్పడ్డారన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి అరుణ్, విద్యార్థులు తేజ, చైతన్య, సాయి కుమార్, సంతోష్, చరణ్ తేజ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భావి భారత పౌరులుగా తయారు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

కడప కల్చరల్ : చిన్నారులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకొని విజ్ఞానవంతులై సమాజానికి ఉపయోగపడే భావి భారత పౌరులుగా తయారు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ హైస్కూలు (మెయిన్)లో 'కడప బాలోత్సవం' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల వేసవి వినోద శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, సంగీతం, ఇంద్రజాల ప్రదర్శన తదితర విషయాలపై హైస్కూలు విద్యార్థినీ విద్యార్థులకు మే 1వ తేది నుంచి 30వ వరకు జరిగిన శిబిరంలో వినోదం, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం ముఖ్యాంశాలుగా నిర్వహించామన్నారు. కడప బాలోత్సవం గౌరవ అధ్యక్షులు నాగముని రెడ్డి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు సమాజ అవసరాలతో ముడిపడి ఉందని, రానున్న సాంకేతిక, సాంస్కృతిక అవసరాల రీత్యా విద్యార్థినీ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. స్పోకెన్ ఇంగ్లీష్ కోర్స్ ట్రైనర్‌గా పాల్గొన్న కృపావేణి మాట్లాడుతూ వేసవి సెలవులలో అదనపు విజ్ఞానాన్ని, వినోదాన్ని సృజనాత్మక కార్యకలాపాల ద్వారా పొందారని, ఈ ప్రయత్నాల్ని కొనసాగిస్తూ ఉండాలని విద్యార్థులకు ఉద్బోధించారు. రిటైర్డ్ హెచ్ఎం బాల ఎల్లారెడ్డి , కార్యక్రమ అనుసంధాన కర్తగా వ్యవహరించిన అరుణ, జన విజ్ఞాన వేదిక కడప పట్టణ అధ్యక్షుడు ఎస్. శివరాం , కడప బాలోత్సవం అధ్యక్షులు జి గోపాల్ మాట్లాడుతూ వేసవి శిబిరానికి హాజరైన విద్యార్థులు చదువులలోనూ, సమాజంలోనూ ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా తయారు కావాలని కోరారు. ఈ సమావేశంలో హెచ్.ఎం నాగమణి, కడప బాలోత్సవం ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను మోసం చేస్తున్న కార్పొరేట్ మాఫియా



విలేకర్లతో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు

కడప ఎడ్యుకేషన్: విద్యను వ్యాపారం చేస్తూ తల్లి దండ్రులను నిలువునా మోసం చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా అక్రమ అడ్మిషన్ చేస్తున్న యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్నారు. శుక్రవారం కడపలోని ఆర్ఎస్ఎఫ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ పాఠశాల పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాల అమ్మకానికి పెట్టిన ప్రైవేట్ కార్పొరేట్ యాజమాన్యం పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే అడ్మిషన్స్ ఫుల్ అయ్యాయని చెప్పడం విడ్డూరం అన్నారు. ఫీజు నియంత్రణ చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు కైపు రామాంజనేయులు, ఆర్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు పప్పు శెట్టి రెడ్డి సాయి, నాయకులు పత్తి ప్రకాష్ పాల్గొన్నారు.

ఉమర్‌బాష సేవలు స్ఫూర్తిదాయకం



ఉమర్‌బాష దంపతులను సత్కరిస్తున్న రైల్వే అధికారులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వేలో చీఫ్ ట్రావెలింగ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఉమర్‌బాష సేవలు స్ఫూర్తిదాయకమని అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు, కడప స్టేషన్ మేనేజర్ శేఖర్‌కుమార్‌లు తెలిపారు. శనివారం అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో స్థానిక రైల్వే శుభమ్ కల్యాణ మండపంలో ఉమర్‌బాష ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో గత 40 సంవత్సరాలుగా ఉమర్‌బాష అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఆయన శేష జీవితం ఆనందమయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉమర్ బాష, ఉమే ఖుల్‌సూమ్ దంపతులను పలువురు రైల్వే అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈఎన్ రాధాకృష్ణ, ఏడీ ఎస్‌టీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, టిక్కెట్ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, చైతన్య, లక్ష్మిశేఖర్, ప్రసన్న, ద్వారకనాథరెడ్డి, రజిత, ఎలిజిబెత్‌రాణి, మేరి, కుమారి, విజయ, రమేష్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలుకు ఉద్యమాలు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కడప వైఎస్ఆర్ సర్కిల్: పెండింగ్ లో ఉన్న లెప్రసీ అలవెన్సులు తక్షణం చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వాటికి జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ కార్యచరణ నిర్ణయించినట్లు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి. వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసీ అలవెన్సులు ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ వాటిని ఆశా కార్యకర్తలకు ఇవ్వకుండా తిరిగి ప్రభుత్వానికి వాపసు చేశామని అధికారులు తెలియజేశారని, తక్షణం వాటిని జూన్ నెల పదవ తేదీ నాటికి తెప్పించి ఇవ్వాలన్నారు. డిమాండ్ల సాధన కోసం జూన్ మూడో తేదీన 'ఆశా డే' సందర్భంగా అన్ని పి హెచ్ సి ,యు పి హెచ్ సి లలోని మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రం ఇవ్వాలని, జూన్ 11, 12, 13, 14, 15 తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు జరుగుతాయని, 16వ తేదీ కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించను న్నామని తెలిపారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ పాల్గొన్నారు.

కమనీయం... కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో శివపార్వతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానదీ తీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ప్రాతఃకాలపూజ, ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అన్నాభిషేకం, ఆవాహిత దేవతాహోమాలు, లఘుపూర్ణాహుతి తదితర పూజలు జరిగాయి. అలాగే ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తిపీఠాలకు, నవరత్నలింగాలకు విశేష పూజాకార్యక్రమాలు చేశారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువు దీర్చారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ముత్యాల తలంబ్రాలతో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. కాగా శనివారం గణపతి, నవగ్రహ, చండీహోమాలు, మహాపూర్ణాహుతి చేయనున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి నామా నాగా శ్రీనివాసులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, తల్లం కిశోర్, అమృతేశ్వరస్వామి, అయ్యప్పస్వామి ఆలయాల కమిటీల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె : ఖరీఫ్‌కు సంబంధించి పంటలు సాగు చేసేందుకు వేరుశనగ కాయలను 40 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తోందని దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్.పాలగిరి రైతు సేవా కేంద్రంలో విత్తన నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేరుశనగ పంట సాగు చేయు ప్రతి రైతుకు విత్తనాన్ని అందిస్తామన్నారు. విత్తనం కొనుగోలు చేసిన ప్రతి రైతు తప్పని సరిగా పంట సాగు చేయాలని సూచించారు. పంపిణీలో ఎటువంటి లోటుపాట్లు జరగకూడదని బయోమెట్రిక్ విధానంలో పంపిణీ చేస్తారన్నారు. అవసరమైన రైతులు తప్పని సరిగా ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం సెల్ నంబరు వెంట తీసుకుని వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, రైతు సేవాకేంద్ర సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

యోగాతో మనశ్శాంతి



రామాలయ ప్రాంగణంలో ఆసనాలు వేస్తున్న ప్రభుత్వ సిబ్బంది

ఒంటిమిట్ట : నేటి ప్రజా జీవనశైలితో నిత్యం అనారోగ్యం పాలవుతున్న ప్రజలకు యోగాతోనే ఆరోగ్యం లభిస్తుందని కడప జిల్లాలోని పలుశాఖల అధికారులు చెబుతున్నారు. శుక్రవారం ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయ ప్రాంగణంలోని పచ్చని వనంలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాకు సంబంధించిన ఇన్‌స్పెక్టర్లు ప్రాథమిక యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం నిర్వహించి వాటి లాభాలను వివరించారు. రోజుకు కనీసం 30 నిమిషాలు యోగా చేస్తే శారీరక దృఢత్వం, మానసిక శాంతి సిద్ధించి ఒత్తిడిని దూరం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్వీన్, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీపీఓ రాజ్యలక్ష్మీ, డీఎంహెచ్ఓ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ గౌస్ బాషా, తహశీల్దార్ వెంకటరమణ, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఇతర అధికారులు, ఉపాధి కూలీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.